క్లుప్తంగా

రేపటి నుంచి ఉపాధి పనులపై గ్రామసభలు

అచ్చంపేట: 2026–2027 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టే ఉపాధి హామీ పనులపై అక్టోబరు 3న ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఇందు కోసం ప్రత్యేక అధికారులను నియమించామని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో పేదలకు అన్నదానం



సత్తెనపల్లి: డొక్కా సీతమ్మ అన్నదాన వితరణ పథకంలో భాగంగా పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో జనసేన నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో దాతలు చాట వెంకటప్పయ్య, సోము రత్తయ్య కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో బుధవారం 140 మంది పేదలకు, రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పికట్ల ప్రవీణ్, డాక్టర్ ప్రేమ మాట్లాడుతూ నిస్వార్థంగా ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్నందుకు నరేంద్రను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ దాసరి ఆషా, అప్పాపురపు సూర్యకుమారి, వి. నాగేశ్వరరావు, కటకం బాబు, కట్టమూరి అప్పారావు, పోతుగంటి నరసింహారావు, దేవతి శివప్రసాద్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనం అపహరణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ హైమారావు బుధవారం తెలిపారు. సత్తెనపల్లి రోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న ఓలేటి మురళీకృష్ణ రోజు మాదిరిగానే తన ద్విచక్ర వాహనాన్ని మంగళవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపాడు. బుధవారం ఉదయం చూసేసరికి కనిపించ లేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు పలు ప్రయోజనాలు

ఏడీఏ రవిబాబు



కొమెరపూడిలో మాట్లాడుతున్న ఏడీఏ

సత్తెనపల్లి: రైతులు జీఎస్టీ ప్రయోజనాలు పొందాలని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు తెలిపారు. మండలంలోని కొమెరపూడిలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొత్త జీఎస్టీతో వివిధ రకాల యంత్ర పరికరాలపై తగ్గుదలను వివరించారు. రైతులు ముఖ్యంగా వినియోగించే మినీ ట్రాక్టర్లు, రోటోవేటర్ల ధరలు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి. సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ కొరివి అనీల్‌కుమార్, గ్రామ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

నార్నెపాడు(ముప్పాళ్ల): జీఎస్టీ తగ్గింపుతో రైతులకు పలు ప్రయోజనాలు చేకూరతాయని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్నెపాడులో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ మినీ ట్రాక్టర్లు, రోటోవేటర్లు, పవర్‌టిల్లర్‌పై 12% జీఎస్టీ నుంచి 5%కు, మినీ ట్రాక్టర్ టైర్లు, విడి భాగాలు 18% నుంచి 5%కు, డ్రిప్ ఇరిగేషన్ సిస్టం, స్ప్రింక్లర్లు 12% నుంచి 5%కు, టార్పాలిన్ పట్టలు, తైవాన్ స్ప్రేయర్లు, రక్షిత గృహాల నిర్మాణాలకు ఉపయోగించే పరికరాలు, సూక్ష్మపోషకాలు, సూక్ష్మ సేద్యంపై 12% నుంచి 5%కు జీఎస్టీ తగ్గించినట్లు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు జెట్టి నాగమల్లేశ్వరరావు, సర్పంచ్ కూరపాటి ప్రభాకరరావు, ఏఈఓ ఎస్.శేషుబాబు, పంచాయతీ కార్యదర్శి మౌనిక, వీపీఏ జి.ఫిలిప్ పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్య రైతులకు పలు ప్రయోజనాలు

సత్తెనపల్లి: సూక్ష్మ సేద్య రైతులకు తగ్గించిన జీఎస్టీతో ప్రయోజనాలు కలగనున్నాయని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ.వెంకట్రావు అన్నారు. మండలంలోని దూళిపాళ్ల, ఫణిదం గ్రామాల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమం, ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొత్త జీఎస్టీతో వివిధ యంత్ర పరికరాలపై తగ్గిన జీఎస్టీ గురించి వివరించారు.కార్యక్రమంలో సత్తెనపల్లి ఉద్యాన అధికారి ఎస్.సురేష్, దూళిపాళ్ల గ్రామ నాయకులు కేదార్నాథ్, ఫణిదం గ్రామ మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ఫణిదం గ్రామ సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఫణిదం గ్రామ నాయకులు కాళిదాసు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ తగ్గింపు

నకరికల్లు: వ్యవసాయ పనిముట్లపై 12శాతంగా ఉన్న జీఎస్టీ 5శాతానికి తగ్గిందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని దేచవరంలో జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ క్యాంపెయిన్‌ను బుధవారం నిర్వహించారు. తగ్గించిన జీఎస్టీ వివరాల పోస్టర్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులతో పాటు వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ భారాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేష్, నరసరావుపేట జీఎస్టీఓ అధికారి ఆనంద్, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో భారీ ప్రయోజనాలు

అచ్చంపేట: కొన్ని వస్తువులపై జీఎస్టీని ఎత్తేయడం, కొన్నింటిపై తగ్గించడం వల్ల అన్ని వర్గాల ప్రజకు లాభం చేకూరుతుందని జీఎస్టీ నోడల్ అధికారి సుధాకర్ తెలిపారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వేల్పూరులో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. కరపత్రాలను విడుదల చేశారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జువ్వా శంకర్, ఉపాధి పథకం ఏపీఓ వెంకటేశ్వర్లు, కంప్యూటర్ ఆపరేటర్ బ్రహ్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై మహిళలు శ్రద్ధ చూపాలి



పెదకూరపాడులో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

పెదకూరపాడు: ఆరోగ్య సంరక్షణపై మహిళలు శ్రద్ధ చూపాలని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విద్య తెలిపారు. స్వస్థ నారీ స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పెదకూరపాడు సచివాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అశ్రద్ధ చేయకుండా సంబంధిత వైద్యశాలలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అర్తిమల్ల రమేష్, ఏటుకూరి బ్రహ్మయ్య, బెల్లంకొండ రాంగోపాలరావు, వడ్లమూడి అప్పారావు, భాష్యం ఆంజనేయులు, బాబూరావు, మద్దినేని సత్యం, అజీముల్లా, పాటిబండ్ల యోహాన్, సరిపూడి గోపి, జాగర్లమూడి రఘు, కంచర్ల సుధాకర్, హెల్త్ సూపర్‌వైజర్ దిలీప్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రీయ పోషణ్ మహా కార్యక్రమంపై అవగాహన

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదలలో ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని మాదలలో 8వ రాష్ట్రీయ పోషణ్ మహా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బాల్య వివాహాలు, వాటి వలన కలిగే నష్టాలను ఐసీడీఎస్ ఏసీడీపీఓ టి.సంతోషి కుమారి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి స్వస్థ నారీ స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమం ప్రయోజనాలను వివరించారు. బాలల హక్కులు, చట్టాలు గురించి కిశోర బాలికలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది వై.ప్రశాంత్, సీహెచ్ నన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

పాలిథిన్ వినియోగంతో క్యాన్సర్ వచ్చే అవకాశం

కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్



ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతున్న కమిషనర్

సత్తెనపల్లి: పాలిథిన్ వినియోగంతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్ అన్నారు. సింగిల్ యూజ్ పాలిథిన్‌ను ఉపయోగించవద్దని ఆయన తెలిపారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ–2025 నినాదంతో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాలిథిన్ వద్దు .. పర్యావరణం ముద్దు అంటూ సిబ్బంది నినాదాలు ఇచ్చారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. నగర ప్రజలంతా పాలిథిన్ కవర్లలో చెత్తను అందించకుండా డస్ట్ బిన్లలో మాత్రమే ఇవ్వాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయడంపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. వ్యాపారులు చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రతి రోజు సాయంత్రం గార్బేజ్ కలెక్షన్‌కు రెండు ట్రాక్టర్లను కేటాయించామని చెప్పారు. ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని షాపుల నుంచి చెత్తను సేకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. విజయ సారథి, మెప్మా టీఎంసీ ఎండీ ఖాజా, సీఓ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత



కేక్ కట్ చేస్తున్న వృద్ధులు

పెదకూరపాడు : జీవితంలో కష్టనష్టాలను అనుభవించి, తమను అభివృద్ధి పథంలో నడిపించిన తల్లిదండ్రులపై పిల్లలు అజాగ్రత్తగా ఉండరాదని తాటికొండ పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజినీర్ కొండయ్య తెలిపారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పాటిబండ్లలోని కారుణ్య వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పెదకూరపాడు ఎంపీడీఓ కె. సాయిలీల మాట్లాడుతూ వృద్ధులు చిన్నపిల్లల లాంటి వారని, వారిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని తెలిపారు. వృద్ధులు, అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న కారుణ్య వద్ధాశ్రమం నిర్వాహకులను అభినందించారు. పిరమిడ్ యోగా సాధకులు పార్థసారథి, వ్యవసాయ శాఖ అధికారి సోమయాజులు, కారుణ్య ఆశ్రమం కార్యదర్శి డాక్టర్ అల్లం ఇన్నారెడ్డి, ఆశ్రమం మేనేజర్ రాము, రెవెన్యూ అధికారి పెరికల నాయుడమ్మ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న వెంకట్రావు

నకరికల్లు: సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. నకరికల్లు సొసైటీ అధ్యక్షుడిగా తిరుమలశెట్టి వెంకట్రావు, సభ్యులుగా చేవూరి వెంకటేశ్వర్లు, కరాలపాటి వలి బుధవారం నకరికల్లులో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ సొసైటీ బకాయిలను సకాలంలో వసూలు చేసి అభివృద్ధి పథంలో నడిపించాలని తెలిపారు. గ్రామీణ అభివృద్ధిలో సొసైటీల పాత్ర కీలకమైందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు మేలు జరుగుతుందని మక్కెన మల్లికార్జునరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, సొసైటీ కార్యదర్శి ప్రసాద్, నాగోతు శౌరయ్య, సాగి శ్రీనివాసరావు, జె.వీరాంజనేయులు, అలీ బాషా, సంగుల కొండలు, దూదేకుల హుస్సేన్ బి, పాలాంజి, గుజ్జుల పోలు పాల్గొన్నారు.

జయ జయహే మహిషాసుర మర్దని !



కొమెరపూడి రేణుకా అంకమ్మ తల్లి ఆలయంలో...



పెదమక్కెన మల్లికార్జునస్వామి దేవాలయంలో...



ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడులో ..



సత్తెనపల్లిలోని వడ్డవల్లి పెద్దబొడ్డు రాయి వద్ద ..



బెల్లంకొండలో మహిషాసుర మర్దనిగా అమ్మవారు

దుష్ట సంహారిణి .. మహిసాసురమర్దని అంటూ అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయాలలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని దేవీ ఆలయాలన్నీ పదవ రోజైన బుధవారం అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

–ముప్పాళ్ల/ సత్తెనపల్లి/అచ్చంపేట/క్రోసూరు/ రాజుపాలెం/బెల్లంకొండ



బ్రాహ్మణపల్లిలో ...



సత్తెనపల్లిలోని కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద ..



సత్తెనపల్లిలోని త్రిశక్తిదుర్గా పీఠంలో ...



సత్తెనపల్లిలోని మేదర సంఘ రామాలయం వద్ద..



అచ్చంపేట శ్రీవాసవీ మాత దేవాలయంలో కాళికాదేవిగా..



అనంతవరంలో ..